# బహుమతి

అప్పట్లో చాలా అందంగా ఉండేదాన్ని నేను. కలువ రేకుల లాంటి కళ్ళు. . ఆ కళ్ళ నిండా కోటి కలలు. . కాళిదాసు చూస్తే ఏమని వర్ణించి ఉండేవాడో. . కాలేజీ కుర్రాళ్ళు మాత్రం "అబ్బ ఏం ఫిగర్ రా!" అనుకునేవారు కళ్ళు అప్పగించి చూస్తూ.

వాళ్ళు అలా అన్నపుడు పైకి కోపంగా చూసేదాన్ని. కానీ కళ్ళు దించుకున్నాక మాత్రం కొంటె నవ్వుతో పెదవులు కెంపులయ్యేవి.

ఆడుతూ పాడుతూ ఉండగానే నా చదువు అయిపోయింది. చదువు అ. యి. పో. వ. డం ఏమిటి! నేనే ఆపేశాను. ఇంకా చదువుకుందాం అన్న ఆలోచనే అప్పుడు నాకు రాలేదు. అసలు అప్పుడు నాకు ఆలోచన అన్నమాటకి అర్థం కూడా తెలీదు. ఎప్పుడూ ఏదో కొంపలు మునిగి పోతున్నట్లూ హడావిడిగా తిరుగుతూ ఉండేదాన్ని. పొరపాటున కూర్చుంటే యిక ఎడతెరిపి లేకుండా మాట్లాడుతూ ఉండేదాన్ని.

రమణి, ఇందిర, జానకి . . . అందరం కలిసే వచ్చేవాళ్ళం కాలేజి నుంచి. తీరికగా కబుర్లు చెప్పుకుంటూ ఆ నాలుగు ఫర్లాంగుల దూరాన్ని నాలుగు గంటలు నడిచేవాళ్ళం. నేరుగా ఇంటికి వచ్చే అలవాటే ఉండేది కాదు. జానకి వాళ్ళింట్లో సన్నజాజులు కోసుకుంటూనో. . రమణి వాళ్ళింట్లో ఉయ్యాల వూగుతూనో మరో రెండు గంటలు గడిపేవాళ్ళం.

లేకపోతే అందరం కలిసి గుడికి వెళ్ళేవాళ్ళం. మా వూర్లో శివాలయం ఎంత బాగుండేదో! చాలా ఎత్తు మీద వుండేది గుడి. అన్నిమెట్లూ సునాయాసంగా ఎక్కేసేవాళ్ళం. తూర్పు వైపున పెద్ద నందివర్ధనం చెట్టు ఉండేది. దాని క్రింద కూర్చుంటే వూరంతా కనిపించేది. మాకబుర్లు ఎప్పుడూ అక్కడే.

ఒక్కొక్క రోజు మేము ఇంటికి వచ్చేసరికి ఎనిమిది దాటేది. అందరి ఇళ్ళూ పక్క పక్కనే వుండేవి. ఎక్కడికి వెళ్ళినా నలుగురం కలిసే వెళ్ళేవాళ్ళం. అందుకే ఇంట్లో వాళ్ళు పెద్దగా పట్టించుకునే వాళ్ళు కాదు.

రమణి వీణ బాగా వాయించేది. జానకి పాటలు బాగా పాడేది. ఇందిర సంగతి చెప్పనే అక్కరలేదు. దానికి రాని విద్య లేదు. ఏపని అయినా చిటికెలో నేర్చుకునేది. మాతో మాట్లాడుతున్నపుడూ.. గుడి దగ్గర కూర్చున్నపుడూ కూడా స్వెట్టర్స్ అల్లడమో .. బుట్టలు అల్లడమో.. ఏదో ఒకటి చేస్తూనే వుండేది.

ఏ పనీ రానిది నాకే. కానీ చిత్రంగా అందరూ నాకే ఎక్కువ యింపార్టెన్స్ యిచ్చేవారు. అవును మరి! బయటి వాళ్ళకి కనపడేది అందమే కదా!

నేను బి. ఏ. పాస్ అవడమే పెద్ద ఘనకార్యం. నేను పాస్ అయానని తెలీగానే మా అత్తయ్య "దానిది మొదటినుంచీ అదృష్ట జాతకమే" అంటూ మురిసిపోయింది.

ఆ తర్వాత వారంరోజులకి జరిగాయి నామొట్టమొదటి పెళ్ళిచూపులు. నాన్న చెప్పారు "ఇంజినీరు.. కథలు కూడా వ్రాస్తాడట." అని. ".. మన అమ్మాయి బాగా నచ్చింది అతనికి.. భావుకుడు కదా!.." అన్నారు. చివరి మాట మెల్లగా అన్నారు కానీ అందరికీ వినపడింది. అత్తయ్య మళ్ళీ నా బుగ్గలు నొక్కుతూ "నాకు తెలుసురా! దానిది అదృష్ట జాతకం" అంది.

పెళ్ళవగానే ఆయనతో హైదరాబాద్ వచ్చేశాను.

అదేం చిత్రమో అన్నాళ్ళు తిరిగిన వూరు ... స్నేహితురాళ్ళు .. అందరినీ వదిలేసి వస్తుంటే కొంచెం కూడా బాధ కలగలేదు. అమ్మని వదిలేసి వస్తున్నందుకు మాత్రం కొంచెం ఏడుపు వచ్చింది.

ఇక్కడికి వచ్చాక కూడా కొన్నాళ్ళు ఏ బాధ్యతలూ లేకుండా తిరగడమే సరిపోయింది.

ఆ తర్వాత.. ఒకరోజు...

సినిమాలోలాగా నేను కళ్ళు తిరిగి పడిపోలేదు. లేడీ డాక్టర్ వచ్చి గంభీరంగా "మీరు తల్లి కాబోతున్నారు" అని చెప్పలేదు. నాకే తెలిసింది ఆవిషయం కొంచెం కంగారు కలిగిస్తూ. ఆయనకి చెప్పాను. అప్పటికి ఆయన సంగతి నాకు పూర్తిగా అర్థం కాలేదు. అందుకే "ఎంత హడావుడి చేస్తారో!" అనుకున్నాను నేను చెప్పబోయేముందు.

కానీ ఆయన చాలా కామ్ గా విన్నారు. చిన్నగా నవ్వినట్లున్నారులే. సంతోషించారు అని అర్థమైంది. అంతే. అంతకంటే పెద్ద స్పందన ఏమీ లేదు ఆయనలో.

కానీ నాకు మాత్రం... నాకు మాత్రం జీవితమే మారిపోయినట్లు అనిపించింది. అసలు అప్పటివరకూ నేను గడిపింది జీవితం కానట్లూ.. అప్పుడే జీవితం మొదలయినట్లూ అనిపించింది.

కొద్ది కొద్దిగా పెరిగే పొట్టా. . కడుపులో బుజ్జిపాపాయి కదలికలూ. . నాకేదో పాఠం నేర్పిస్తున్నట్లుగా వుండేవి. అవును మరి! అప్పటికి యింకా గుండెల మీద మంగళ సూత్రాల కదలికే సరిగా అలవాటు కాలేదు! !

అప్పటివరకూ నేను ఎపుడూ ఏడవలేదు నిజమే. కాని ఆనందం అంటే ఏమిటో మాత్రం అపుడే తెలుసుకుంటున్నాను అనిపించేది.

చాలా భయంగా వుండేది. తొమ్మిదో నెలలో పొట్ట తడుముకుంటూ అనుకునేదాన్ని. . "అసలు యిది ఎప్పటికైనా ఫ్లాట్ గా అవుతుందా! నేను మళ్ళీ మామూలుగా, హాయిగా, అందంగా నడవగలుగుతానా!" అని.

ఆ భయంకూడా ఆనందంగానే వుండేది.

ఆడపిల్ల కావాలని వుండేది నాకు. కానీ సుమంత్ పుట్టాడు. సుమంత్. . ఆ పేరు నేనే పెట్టాను. ఆయనయితే అసలు పిల్లలకి పేర్లుంటాయనీ. . అవి వాళ్ళ పెద్దవాళ్ళు వాళ్ళకి పెడతారనీ కూడా తెలియనట్లు కనిపించేవారు. మరి ఆయన కథల్లో హీరోలకీ హీరోయిన్లకీ అన్నన్ని కొత్త కొత్త పేర్లు ఎలా ఆలోచించి పెట్టేవారో!

అప్పట్లో సుమంత్ చాలా కొత్త పేరు. నా జీవితంలో నేను శ్రద్ధగానూ, దీక్షగానూ చేసిన మొట్టమొదటి పని అదేనేమో! వాడికి పేరు పెట్టడం. ఎన్నెన్ని పుస్తకాలు వెతికానో . . కేవలం పేర్లకోసం!

అసలు ప్రతిపనీ సున్నితంగా చేయడం అలవాటు అయిపోయింది. అప్పటివరకూ తినడం తిరగడం తప్ప ఏమీ తెలియనట్లూ. . పూలనీ ప్రకృతినీ చూసికూడా పరవశించడం చాతకానట్లూ వుండేదాన్ని! అమ్మని అయ్యేసరికి ఎంత మారిపోయానో!

వాడి పాలసీసాలు స్టెరిలైజ్ చేయడం. . వాడికి స్నానం చేయించడం. . పౌడర్ అద్దడం. . ముద్దుల్లో ముంచెత్తడం. .

వాడికోసం రంగురంగుల చొక్కాలు కొనడం. . బుగ్గన దిష్టిచుక్క పెట్టడం. . సాయంత్రం కాగానే షికారు తీసుకువెళ్ళడం. .

వాడ్ని స్కూల్లో చేర్చడం. . కొత్త పుస్తకాలు కొనడం. . వాటికి అట్టలు వేయడం. . ఓహ్ ! తల్చుకుంటూ వుంటేనే అద్భుతంగా వుంది. ఏమనాలి ఆరోజుల్ని! నా జీవితంలో స్వర్ణయుగం అనాలా! ఆరోజుల్లో ప్రతి రోజూ. . ప్రతి గంటా. . ప్రతి నిమిషం నేనేం చేశానో నాకు గుర్తుంది.

వాడు పుట్టాక అసలు మిగతా లోకంతోనూ మనుషులతోనూ సంబంధం తెగిపోయింది.
వాడూ అంతే. ఇంట్లో ఉన్నంతసేపూ నాచేయి వదిలిపెట్టేవాడు కాదు.
వెనకాలే తిరుగుతూ ఏవేవో ప్రశ్నలు వేస్తూండేవాడు. నేను అంతకన్నాను. వాడు అడిగిన ప్రతీ ప్రశ్నకీ సమాధానం చెప్పేదాన్ని.
ఒకసారి వాడిని తీసుకుని అమ్మావాళ్ళ వూరు బయలుదేరాను.
బస్సెక్కి విండో సీట్ లో కూర్చున్నా. వాడేమో నావళ్ళో కూర్చుని ప్రశ్నలు.
"అమ్మా! మనం ఎక్కడికి వెళ్తున్నాం!"
"ఊరికి"
"ఏ ఊరు!"
"తాతయ్య వాళ్ళ వూరు"
"ఎందుకు!"
"పండగకి. సంక్రాంతి పండగ కదా! అందుకని."
"మళ్ళీ ఎప్పుడు వస్తాం!"
"పండగ అయిపోయాక"
"పండగ ఎప్పుడు అయిపోతుంది?"
....
ఈ ధోరణిలో మాట్లాడుకుంటూనే ఉన్నాం నాలుగుగంటలపాటు. తీరా బస్ దిగేటపుడు తలెత్తి చూస్తే...
బస్ లో అందరూ మావైపే చూస్తున్నారు, సన్నగా నవ్వుతూ. ఇప్పుడు తల్చుకుంటే చచ్చేంత సిగ్గేస్తోంది. అప్పుడు మాత్రం నాకొక్కదానికే కొడుకు ఉన్నంత గర్వంగా నవ్వి బస్ దిగేశాను.
అసలు ఏప్రశ్నకి సమాధానం చెప్పకపోతే వాడు చిన్నబుచ్చుకుంటాడో అనిపించేది. పిల్లల మనస్తత్వం గురించీ.. ఫీలింగ్స్ గురించీ ఎక్కడైనా ఉపన్యాసాలు విన్నపుడు భయపడిపోయేదాన్ని... "అసలు నేను వీడ్ని సరిగా పెంచుతున్నానా!" అనిపించేది.
బాగా చిన్నపుడు వాడు ఒకసారి అడిగాడు. "అమ్మా! చంద్రుడు రాత్రిపూటే ఎందుకు వస్తాడు!" అని. నాకు ఏం చెప్పాలో తెలీలేదు. నేనేమీ సాహిత్యాలు చదివినదాన్ని కాదు.. గొప్ప తెలివితేటలున్నదాన్నీ కాదు.

కాసేపు ఆలోచించి "చంద్రుడికి రాత్రంటే యిష్టం. అందుకని." అని చెప్పాను. అప్పుడు నాబుర్రకి తోచిన సమాధానం అంతే.

కానీ ఆతర్వాత చాలాసార్లు అనుకున్నాను. నేను కాబట్టి యింత చచ్చు సమాధానం చెప్పానేమో! అదే బాగా చదువుకున్న అమ్మ అయితే యింకా బాగా ఏమైనా చెప్పివుండేదేమో! అని.

ఇపుడే ఇలా వుంటే .. యిక వీడు పెద్దవాడు అయ్యేకొద్దీ వాడికొచ్చే సందేహాలు నేను ఎలా తీర్చగలను! అని భయపడేదాన్ని.

కానీ వాడికి పాతికేళ్ళు వచ్చేవరకూ.. పెళ్ళయ్యే వరకూ మా బంధం అలాగే సాగింది. ఇపుడు వాడికే ఒక కొడుకున్నాడు. "హేమంత్".

ఇదిగో.. యిపుడు.. యిన్నాళ్ళ తర్వాత..

కొడుకూ, కోడలూ.. ఈయనా.. అందరూ నాతో ఏ అవసరమూ లేనట్లుగా ప్రవర్తిస్తుంటారు. అసలు నాకు ఏమీ తెలియదని వాళ్ళ అభిప్రాయం. అది నిజమే అయినా 'వాళ్ళు అలా అనుకుంటారు" అన్న విషయం బాధ కలిగిస్తుంది.

"పిచ్చిమొద్దు" అనేది ఆయన ఊతపదం. అవును మరి ఆయన ఆలోచనకీ ... నా ఆలోచనకి హస్తిమశకాంతరం వుంది.

ఈ పాతిక ముప్పై ఏళ్ళనుంచీ ఆయన సంసారంలో ప్రతిచిన్న బాధ్యతా నాభుజాల మీద పడేశారు. రకరకాల పుస్తకాలు చదువుకుంటూ .. విజ్ఞానాన్ని పెంచుకుంటూ ఎదిగిపోయారు. నేనేమో సుమంత్.. వాడు వున్న యిల్లు.. వాడి అవసరాలు.. యివే లోకంగా బ్రతికాను.

అందుకే ఆయన పిచ్చిమొద్దు అన్నా నాకు ఏమీ అనిపించదు కానీ ... సుమంత్ నన్ను నిర్లక్ష్యం చేయడమే బాధ కలిగిస్తుంది.

వాడికి యిపుడు ఆఫీసులో గొప్ప గొప్ప ఫ్రెండ్స్.. యింట్లో మేధావి అయిన నాన్నగారు.. సరదా కబుర్లకి భార్య.. యిక అమ్మతో పనేముంది!

అందరిమీదా ఏదో కసి కలుగుతోంది నాకు. మనుషులమీదే కాదు.. దేవుడి మీద కూడా.

తమ పనిని తాము చక్కగా నిర్వర్తిస్తే దేవుడు మెచ్చుకుంటాడంటారు కదా! మరి నేను నా పనులన్నిటినీ యింత బాధ్యతగా చేసుకొస్తే, ఈ ముసలితనంలో ఆయన నాకు యిచ్చినదేమిటి? అందరి నిర్లక్ష్యమా! ఈ ఒంటరితనమా!

జీవితమంతా పుస్తకపఠనంలో గడిపినందుకూ . . మంచి పుస్తకాలని ప్రపంచానికి అందించినందుకూ. . నాభర్తని లోకం మేధావి అంది.
మరి నాజీవితమంతా నేను ఒక బిడ్డని అపురూపంగా ప్రేమించడంలో గడిపాను. ఒక శాస్త్రవేత్తని పెంచి లోకానికి అందించాను.
నాకు గుర్తింపు లేదా! కనీసం నా బిడ్డనుంచైనా. . . !
కొడుకూ, కోడలూ, మనవడూ టి. వి. చూస్తుంటారు. ఆయనేమో చదువుకుంటారు. నేను మాత్రం వంటరిగా కూర్చుని ఈ దేవుడిపటాలు చూస్తూ "ఎందుకిలా చేశావయ్యా! నన్నింత వంటరిగా. . !" అని అడుగుతుంటాను. ఇదే నా దినచర్య. మిగిలిన జీవితమంతా అనుసరించాల్సిన టైమ్ టేబిల్ .
కాదు. అసలు ఈ దేవుడితో మాత్రం నేనెందుకు మాట్లాడతాను?
ఒక అమ్మాయి. . కలలు కనడం తప్ప ఏమీ తెలీనట్లు పెరిగిన అమ్మాయి. , అమ్మ అయ్యి. . . అయినప్పటినుంచీ తనని తానే మర్చిపోయి. . అమ్మగా తప్ప తనకి అస్తిత్వమే లేనట్లూ. . అలా ప్రేమించడమే తన వ్యక్తిత్వమైనట్లూ బ్రతికితే. . , ఆ తపస్సుకు దేవుడిచ్చిన బహుమతి ఏమిటి! ఒంటరితనం. . భయంకరమైన ఒంటరితనం. అందరూ వుండీ ఎవరూ లేరనిపించే ఒంటరితనం.
నా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి . కళ్ళముందు చిన్నికృష్ణుని బొమ్మ మసక మసకగా కనపడుతోంది. . . కృష్ణుడి పెదవులపై కొంటె నవ్వు కూడా.
అప్పుడు వినపడింది. . హాల్లోనుంచీ ఏదో శబ్దం. హేమంత్ ఎందుకో గుక్క పట్టి ఏడుస్తున్నాడు. మా అబ్బాయి అరుస్తున్నాడు. నేను లేవబోయేలోపూ హేమంతే పరుగెత్తుకుంటూ వచ్చాడు. వెనకాలే మావారు. . సుమంత్. . కోడలూ. .
"ఏమైందిరా!" అన్నాను నేను.
"వాడి బొంద" విసుక్కున్నాడు సుమంత్ "చంద్రుడు రాత్రిపూటే ఎందుకు వస్తాడు నాన్నా! అని అడుగుతాడు. ఏం చెప్పాలి వాడికి! నీకు తెలియదులేరా! అంటే పెద్దగా ఏడుపు."
మావారు చెప్పబోయారు. .
"చంద్రుడూ . . . రాత్రిపూటా. . ఎందుకు వస్తాడంటే. . ఎందుకంటే. . ఇపుడు భూమి తిరుగుతూ వుంటుంది కదా! . . అప్పుడూ. . ." అక్కడితో ఆగి బిత్తరచూపులు . చూడసాగారు.

అందరివైపూ నిరసనగా ఒక్కచూపు చూశాడు హేమంత్ . నా వళ్ళో కూర్చుని "నాయనమ్మా! నువు చెప్పు!" అన్నాడు.
నేను వాడిని దగ్గరికి పొదువుకుంటూ చెప్పాను.. "ఎందుకంటే చంద్రుడికి రాత్రంటే యిష్టం. అందుకని."
నేను చెప్తూండగానే వాడి కళ్ళు మెరిశాయి "నిజమా!" అన్నాడు.
అందరిమొహాల్లో చిరునవ్వు విరిసింది. నాకు తెలుసు అది అపహాస్యమని. నా పిచ్చి సమాధానానికి వాళ్ళంతా నవ్వుకుంటూ వెళ్ళిపోతుంటే...
హేమంత్ మాత్రం నన్ను చుట్టుకుపోతూ అన్నాడు "వాళ్ళెవరికీ ఏమీ తెలీదు నాయనమ్మా. ఇంకెపుడూ వాళ్ళతో అసలు మాట్లాడను నేను" అని.
నాకు అర్ధమయింది దేవుడు నాకిచ్చిన బహుమతి ఏమిటో!

*****